సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 21 । జూలై । 2024




**ఉధృతంగా గోదావరి**
ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.
- 8లో▸



**అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్**
తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.5⁰ /23.5⁰

**వాతావరణం**
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కంట్రోలు రూం ఏర్పాటు

**మహబూబాబాద్:** జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నీటి ప్రవాహాల దగ్గర అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షానికి సంబంధించిన సమస్యలపై కంట్రోల్ రూం నంబర్ 799 5074803లో సంప్రదించాలని సూచించారు. వర్షాలు, ఉరుములు, మెరుపుల సమయంలో పిడుగుపాటుకు అవకాశం ఉంటుందని, ప్రజలు చెట్లకింద, సమీపంలో, టవర్ల దగ్గర ఉండొద్దన్నారు. ఉరుములు , మెరుపులు వచ్చే సమయంలో ఎలక్ట్రికల్ వస్తువులు, మొబైల్ ఫోన్లు ఉపయోగించవద్దన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు.అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



**తొర్రూరు:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంపొందించాలని తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాన్ని జడ్జి సందర్శించారు. సౌకర్యాలపై ఆరాతీసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించాలని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి ఉపాధ్యాయులు బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముందస్తు చర్యలు తీసుకోవాలి

**నర్సింహులపేట:** ఆశ్రమ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఈఓ రామారావు అన్నారు. హెచ్చరించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం వంతడపల స్టేజీ పీఎస్‌ను తనిఖీ చేశారు. జీసీడీఓ విజయకుమారి, పాఠశాల హెచ్‌ఎం స్వప్న, ఉపాధ్యాయులు రాగిణి, పద్మావతి, సాయికృష్ణ పాల్గొన్నారు.

**ఉత్తీర్ణత సాధించాలి..**
**దంతాలపల్లి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రామారావు అన్నారు అన్నారు. మండలంలోని దాట్ల పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఏఎస్ఓ సంతోష్, జీసీడీఓ విజయకుమారి, నోడల్ అధికారి శ్రీదేవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవరెడ్డి ఉన్నారు.

**నూతన కేజీబీవీ..**
**మహబూబాబాద్ అర్బన్:** జిల్లాలోని దంతాలపల్లి మండలంలో 2024–25 విద్యా సంవత్సరంలో నూతనంగా కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రారంభిస్తున్నట్లు డీఈఓ రామారావు శనివారం తెలిపారు. దంతాలపల్లి కేజీబీవీ ఈ విద్యా సంవత్సరం నుంచి నర్సింహులపేట మోడల్ స్కూల్‌లో కొనసాగుతుందన్నారు. ఆరో నుంచి ఏడో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధన చేపట్టనున్నట్లు చెప్పారు.

### అప్రమత్తంగా ఉండాలి

**మహబూబాబాద్:** భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ అధికారులతో వర్షాలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పాత భవనాలు ఉంటే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగు ల ప్రవాహం, చెరువులు, కుంటల నీటి మట్టాలను ఎప్పటికప్పుడు గమనించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాలతో జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ అలివేలు, జెడ్పీ సీఈఓ నర్మద, డీపీఓ హరిప్రసాద్, డీఎంహెచ్ఓ కళావతి బాయి ఉన్నారు.

# దోమలు, పందులను అరికట్టాలి

**మానుకోట మున్సిపాలిటీలో కుక్కలు, కోతులతో పరేషాన్**

- పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి
- మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు ప్రజల విన్నపం
- పందుల పెంపకందారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం
- దోమల నివారణకు ఫాగింగ్, కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో కమిషనర్



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రవీందర్

మహబూబాబాద్

దోమలు, పందుల బెడదను అరికట్టాలని, పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని, డ్రెయినేజీ, రోడ్లు, ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని మానుకోట మున్సిపాలిటీ ప్రజలు కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్నారు. పారిశుద్ధ్య సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, కుక్కల బెడదను అరికట్టేందుకు ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేశామని, దోమల నివారణకు ఫాగింగ్ చేపడుతున్నామని, నిధుల విడుదల ఆధారంగా డ్రెయినేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామని, ఖాళీ స్థలాల యజమానులకు నోటీస్‌లు ఇచ్చి శుభ్రం చేయించడంతో పాటు ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయిస్తామని, పందులు, కోతులు, వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాగా ఫోన్‌ఇన్ కార్యక్రమం సందర్భంగా సిబ్బంది తక్షణమే స్పందించి పలువార్డుల్లో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

**ప్రశ్న:** మా వార్డు పరిధిలో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు కోతులు, పారిశుద్ధ్య సమస్య ఉంది.
–అశోక్‌కుమార్, సురేష్, మల్లయ్య, శ్రావణ్, మూడోవార్డు జమాండ్లపల్లి

**కమిషనర్:** కుక్కల సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతాం. ఏబీసీ సెంటర్ ద్వారా వాటి బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్య సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం . వీధి దీపాలను సరిచేస్తాం.

**ప్రశ్న:** ఆరో వార్డు పరిధిలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దోమల, పందుల సంఖ్య పెరిగింది. రోడ్లు బురదమయంగా మారాయి.
–ఇమ్రాన్, ఖాదర్ బాబా ఆరోవార్డు బేతోలు

**కమిషనర్:** ఖాళీ స్థలాల యజమానులకు నోటీస్‌లు ఇచ్చి శుభ్రం చేయిస్తాం . ప్రభుత్వ స్థలాల్లో పిచ్చి మొక్కలను జేసీబీతో శుభ్రం చేయిస్తాం. దోమల నివారణ కోసం తక్షణమే ఫాగింగ్ చేయిస్తాం. పందుల బెడదను అరికట్టేందుకు పెంపకం దారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** మా వార్డులో కోతుల సమస్య పరిష్కరించాలి.
–వెంకన్న, 9వ వార్డు

**కమిషనర్:** గతంలో బడ్జెట్ కేటాయించి కోతులను పట్టించి అడవుల్లో వదిలిపెట్టాం. కానీ కోతులు మళ్లీ వస్తున్నాయి. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** కోర్టు సెంటర్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్ సమస్య పరిష్కరించాలి. ఇంటి నంబర్ల సమస్య పరిష్కరించాలి.
– పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, కొండపల్లి గోపాల్‌రావునగర్ కాలనీ

**కమిషనర్:** వీధి దీపాల సమస్య పరిష్కరిస్తాం. సెంట్రల్ లైటింగ్ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం. ఇంటి నంబర్ల గురించి కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

**ప్రశ్న:** ధర్మన్నకాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి. కాకతీయకాలనీ నుంచి ధర్మన్న కాలనీ వరకు రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది.
– ఎం.రవీందర్, సురేందర్, శంకర్ 25వ వార్డు

**కమిషనర్:** డ్రెయినేజీ, రోడ్ల సమస్య వెంటనే పరిష్కరించలేం. నిధుల విడుదలను బట్టి వాటిని పరిష్కరిస్తాం.

**ప్రశ్న:** లక్ష్మిటాకీస్ వద్ద డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. సాయిబాబా గుడి రోడ్డు సమస్య తీవ్రంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి.
–సోమ శ్రీను, మహ్మద్ ఖాజా 34వ వార్డు

**కమిషనర్:** లక్ష్మిటాకీస్ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. సాయిబాబా రోడ్డులో పనులను వేగంగా చేయాలని అధికారులను ఆదేశిస్తాం.

**ప్రశ్న:** వన మహోత్సవంలో మొక్కలు నాటాలి.
– ఎం.శ్రావణ్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, నలమాస కరుణాకర్ 12వ వార్డు

**కమిషనర్:** కార్యాలయంలో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారు మొక్కలు తీసుకెళ్లొచ్చు. త్వరలోనే 12వ వార్డులో వన మహోత్సవం నిర్వహించి మొక్కలు నాటుతాం.

**ప్రశ్న:** కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలి.
– మోతిలాల్, భీముడు 19వ వార్డు

**కమిషనర్:** కుక్కల సమస్య పరిష్కరిస్తాం. కోతుల సమస్య విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

**ప్రశ్న:** 18వ వార్డు పరిధి కాలనీల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి.
– రేషపల్లి నవీన్ 18వ వార్డు

**కమిషనర్:** పారిశుద్ధ్య సమస్య వెంటనే పరిష్కరిస్తాం. వీధి దీపాలు ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం. నిధుల విడుదల ఆధారంగా ఆ కాలనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం.

**ప్రశ్న:** మా వార్డులో రోడ్లు, కరెంట్ సమస్య పరిష్కరించాలి.
– యాకాంబ్రం 26వ వార్డు

**కమిషనర్:** కరెంట్ సమస్య పరిష్కరిస్తాం.

**ప్రశ్న:** ప్రగతి కాలనీలో నెలకొన్న తాగునీరు, విద్యుత్, రోడ్ల సమస్య తీర్చాలి.
– సోమ పాపన్న 4వ వార్డు

**కమిషనర్:** అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా.

**ప్రశ్న:** దాసరి నాగభూషన్‌రావు కాలనీ సమస్యలు పరిష్కరించాలి. దోమలను అరికట్టాలి.
– ఎస్.సత్యం, కాలనీవాసి

**కమిషనర్:** దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం . తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

**ప్రశ్న:** జిల్లా కేంద్రంలోని గ్రీన్ ల్యాండ్ల రక్షణకు చర్యలు తీసుకోవాలి. అందుకు కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలి.
– సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

**కమిషనర్:** గ్రీన్‌ల్యాండ్ల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉన్న రోడ్డు సమస్య పరిష్కరించాలి. బైపాస్ రోడ్డులో వీధిదీపాల సమస్య పరిష్కరించాలి.
– జి.నరేష్ ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ప్రాంతం

**కమిషనర్:** రోడ్డు విషయంలో అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తాం. వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

**ప్రశ్న:** డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి.
– స్వామినాథ్ 13వ వార్డు

**కమిషనర్:** డ్రెయినేజీ సమస్య వెంటనే పరిష్కరిస్తాం.

**ప్రశ్న:** అనంతారం గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ, కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. సిబ్బంది కొరత కూడా ఉంది.
– కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి

**కమిషనర్:** చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. పారిశుద్ధ్య సమస్యకు చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** 13వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి. జీడీసీ ప్రహరీ కూలి ఇబ్బంది పడుతున్నాం. పైపులైన్‌లు పగిలాయి. డ్రెయినేజీ, పశువుల సమస్య ఉంది.
– వెంకటరెడ్డి 13వవార్డు

**కమిషనర్:** కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ప్రహరి సమస్య పరిష్కరిస్తాం. వీధి దీపాలు, డ్రెయినేజీ సమస్య తీరుస్తాం. పశువులు రోడ్ల మీద తిరగకుండా చూడాలని పెంపకందారులతో మాట్లాడుతా.

**తక్షణ స్పందన...**



స్నేహనగర్ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో తెలిపిన సమస్యలపై కమిషనర్ వెంటనే స్పందించి 12వార్డు పరిధిలోని స్నేహనగర్ కాలనీతో పాటు పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ దగ్గరుండి పనులు చేయించడంతో పాటు ఫోన్‌ఇన్ కార్యక్రమంలో సమస్యలు తెలిపిన వారితో మాట్లాడి పరిష్కరించారు. పలు వార్డుల్లో సిబ్బంది పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. 19వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య పనులు చేశారు. కాగా ఆయా ప్రాంత ప్రజలు కమిషనర్, సాక్షికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### గ్రామాల్లో వైద్య శిబిరాలు



చౌళ్లతండాలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



వైద్య శిబిరాన్ని సందర్శించిన డాక్టర్ సుధీర్‌రెడ్డి

సాక్షి స్పందన

**కురవి:** మండలంలోని చౌళ్ల తండా, సూదనపల్లి గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సాక్షి దినపత్రికలో 'మంచం పట్టిన మానుకోట' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈమేరకు రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. సూదనపల్లిలో కురవి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఐదుగురి నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. 82 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని ప్రోగ్రాం అధికారి సుధీర్‌రెడ్డి సందర్శించారు. అలాగే చౌళ్ల తండాలో బలపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సహకారంతో పరీక్షలు చేశారు. యాంటీ లార్వాలు ఆపరేషన్ చేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్లు విరాజిత, నిఖిల, స్రవంతి, పీహెచ్ఎన్ శోభ, సూపర్‌వైజర్లు నీరజ, ఏసుమణి, ఏఎన్ఎంలు జ్యోతి, భాగ్యమ్మ, లక్ష్మి, ఆశ కార్యకర్తలు నీల, సరోజ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి'

**నెహ్రూసెంటర్:** విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ జనగం నరేశ్ శనివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ ప్రజావాణిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఎట్టకేలకు ఎస్సైల బదిలీ

**ఒక వైపు ఎస్సైలపై ఆరోపణలు**

- మరోవైపు రాజకీయ నాయకుల ఒత్తిడి
- డోర్నకల్ నియోజకవర్గంలో కదలని సబ్ ఇన్‌స్పెక్టర్లు



**సాక్షి, మహబూబాబాద్:** జిల్లాలో రెండు నెలలుగా నేడో.. రేపో ఎస్సైలు బదిలీలు జరుగుతాయనే వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ మేరకు శనివారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవైపు అధికారుల ఒత్తిడి, మరోవైపు పలువురి ఎస్సైలపై ఆరోపణల నేపథ్యంలో ఎవరిని నొప్పించకుండా.. తానొవ్వకుండా.. బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, ఇల్లెందు, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో 18 పోలీస్ స్టేషన్లు ఉండగా... ఒక్క డోర్నకల్ నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల పలువురు ఎస్సైలకు స్థానచలనం కలిగింది. కాగా డోర్నకల్ నియోజకవర్గంలో సైతం మరో జాబితాతో బదిలీలు ఉంటాయని వార్తలు వస్తున్నాయి.

**నొప్పించక.. తానొవ్వక..**
శాంతి భద్రతల పరిక్షణతోపాటు గుండుబా నిర్మూలన, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తూ ముందుకు వెళ్తున్న పోలీస్‌శాఖకు ఎస్సైల బదిలీ ప్రక్రియ చాలెంజ్‌గా మారింది. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న పలువురి ఎస్సైలపై అవినీతి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వం మారినా పలువురు ఎస్సైలు పాత ధోరణిలోనే వ్యవహరిస్తున్నారు. కాగా, వారి స్థానంలో తమకు అనుకూలమైన అధికారులను వేయాలని పలువురు ఎమ్మెల్యేలు పోలీస్‌శాఖను కోరినట్లు సమాచారం. దీంతో ప్రజాప్రతినిధులు చెప్పిన విధంగా నియామకాలు చేపట్టాలా.. అలా అని ఆరోపణలు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి మంచి పోస్టింగ్స్ ఇస్తే ఎలా అని పోలీస్ బాస్ తర్జనభర్జనలో పడినట్లు తెలిసింది. ఇన్ని రకాల పరిణామాల్లో తాను వేటు వేయాలని భావించిన వారిపై వేటు వేస్తూనే.. ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలకు విలువ ఇస్తూ బదిలీలు చేపట్టినట్లు ప్రచారం.

**రాజకీయ నాయకుల ప్రమేయం..**
పోలీస్‌శాఖ అధికారుల బదిలీల్లో రాజకీయ నాయకుల జోక్యం చేసుకోరని, శాంతి భద్రతల పరిక్షణలో జోక్యం చేసుకోబోమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పెద్దలు గతంలో చెప్పారు. అయితే ఆ మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. జిల్లాలో జరిగిన ఎస్సైల బదిలీల్లో రాజకీయ నాయకుల ప్రమేయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని పలువురు నాయకులు చెబుతున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన అధికారులను వారి పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నియమించుకున్నట్లు తెలిసింది. అదేవిధంగా డోర్నకల్ నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఎస్సైల బదిలీలు జరగలేదని, వీరికోసం మరో జాబితా ఉంటుందని ప్రచా రం . కాగా, శనివారం 13 మంది ఎస్సైల జాబితాతో బదిలీ ప్రకటన రాగా.. ఇందులో వీఆర్‌లో ఉన్న వారు డోర్నకల్ నియోజకవర్గంలోని పలు స్టేషన్లల్లో పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

### బదిలీ అయినవారు..

**మహబూబాబాద్ రూరల్:** జిల్లాలోని పలువు రు ఎస్సైలను బదిలీచేస్తూ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశా రు. కేసముద్రం ఎస్సై వంశీధర్ వీఆర్‌కు, డీసీ ఆర్బీ ఎస్సై జి.మురళీధర్ రాజు కేసముద్రం బదిలీ అయ్యారు. మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి వీఆర్‌కు, డీఎస్బీ ఎస్సై ఎస్.కె.రియాజ్ పాషా మహబూబాబాద్ రూర ల్, నెల్లికుదురు ఎస్సై కె.క్రాంతికిరణ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. వీఆర్ ఎస్సై సీహెచ్.రమేశ్‌బాబు నెల్లికుదురుకు, గూడూరు ఎస్సై సీహెచ్.నగేష్ మహబూబాబాద్‌టౌన్–1కు, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి గూడూరుకు, కొత్తగూడ ఎస్సై వి.దిలీప్ భద్రాద్రి జోన్–4 డీఐజీ కార్యాలయానికి, ఖమ్మం రూరల్ రెండో ఎస్సై పి.కుశకుమార్ కొత్తగూడకు, డోర్నకల్–1 ఎస్సై కె.తిరుపతి బయ్యా రం బదిలీ అయ్యారు. బయ్యారం ఎస్సై జి. ఉపేందర్ పెద్దవంగరకు, పెద్దవంగర ఎస్సై బి. మహేశ్ ఖమ్మం వీఆర్‌కు బదిలీ అయ్యారు.

# చెరువులు, వాగులకు జలకళ



గార్ల సమీపంలో పాకాల ఏటి చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

- జాలువారుతున్న జలపాతాలు
- గార్ల పాకాల ఏటి ఉధృతితో గ్రామాలకు రాకపోకలు బంద్



అలుగు పారుతున్న తులారాం ప్రాజెక్టు

**గార్ల:** జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, వాగులు, వంకలు జలకళ సంతరించుకున్నాయి. కాగా శనివారం బయ్యారం మండలంలో అత్యధికంగా 60.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో తులారాం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు అలుగు పారుతున్నాయి. అలాగే డోర్నకల్ సమీపంలో మున్నేరు వాగు దిగువకు ఉరకలేస్తోంది. గార్ల సమీపంలోని పాకాల ఏరు చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈమేరకు వరద ఉధృతిని మహబూబాబాద్ డీఎస్పీ తిరుమలరావు, తహసీల్దార్ రవీందర్, గార్లబయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై జీనత్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదాలను నివారించేందుకు ముందస్తుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వరద ఉధృతితో గార్లకు కూతవేటు దూరంలో ఉన్న రాంపురం, కొత్తతండా, పులిగుట్టతండా, మద్దివంచ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రహదారి సౌకర్యం కల్పించాలని ఆయాగ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పాకాల ఏటి వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీఎస్పీ తిరుమలరావు



డోర్నకల్ సమీపంలో మున్నేరువాగుకు జలకళ

### విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

**మహబూబాబాద్:** దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాశరథి శత జయంతి ఉత్సవాలను ఈనెల 22నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నగూడూరు మండల కేంద్రంలోని దాశరథి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని చెప్పారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీ మానుకోటకు వరకు నిర్వహిస్తామన్నారు. సభలో జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కవులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, నాయకులు కమలాకర్, వెంకన్న, కన్నా, కౌన్సిలర్ వేణుమాధవ్, శంకర్, శివకుమార్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయండి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్
- పోలీస్ కంట్రోల్ రూం 87126 56928 నంబర్ ఏర్పాటు



ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**మహబూబాబాద్ రూరల్:** జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, అత్యవసరమైతేనే ప్రజలు ప్రయాణాలు చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తమై విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజల సౌకర్యార్థం పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 87126 56928 నంబర్‌ను కేటాయించామని పేర్కొన్నారు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, అత్యవసర సయయంలో ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అప్రమత్తతతో ఉంటుందని తెలిపారు. భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తాయని, ప్రజలు దాటేందుకు ప్రయత్నం చేయవద్దని సూచించారు. చెరువులు, వాగుల వద్ద మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లొద్దని, రైతులు విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను చేతులతో తాకవద్దని సూచించారు. చెట్లు, పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల పక్కన ఉండొద్దని, ముఖ్యంగా విద్యార్థులు, పిల్లలు పాత భవనాల్లో ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెరువులు, కుంటలు, అలుగుల దగ్గర, ప్రధాన రహదారులపై ప్రవహించే వాగులు, వంకలు దగ్గర నీటి ప్రవాహం స్థితిగతులపై ముందస్తు సమాచారం తెలుసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు పర్యవేక్షించాలని, తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజల రాకపోకలను గమనించాలన్నారు. నీటి ప్రవాహం, వర్షం వల్ల ఏర్పడిన గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని, సిబ్బంది అలాంటి ప్రదేశాల్లో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

## 20.9 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం



నీటితో కళకళలాడుతున్న పాకాల సరస్సు

ఖానాపురం: మండలంలోని ప్రధాన నీటి వనరు పాకాల సరస్సు నీటి మట్టం 20.9 ఫీట్లకు చేరుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు కాగా మరో 2.3 ఫీట్ల నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పంటలకు నీరు సరిపోయే అవకాశం ఉంటుంది. సరస్సులోకి నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పాలధారలా.. భీమునిపాద జలపాతం



సీతానగరం శివారు అడవిలో పాలధారలా భీమునిపాద జలపాతం

గూడూరు: మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ముల వంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి పాలధారలా జాలువారుతోంది. పర్యాటకులు చేరుకొని జలపాతాన్ని వీక్షిస్తూ నీటిలో ఆటలాడారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధి తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) గురువారం గోదావరిలో చేపల వేటకు వెళ్లి గల్లంతు కాగా శనివారం అతడి మృతదేహం లభ్యమైంది. రాజు మృతదేహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి రేవు సమీపంలో గోదావరిలో లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు సున్నంబట్టి రేవు గ్రామానికి వెళ్లి పరిశీలించి రాజు మృతదేహంగా గుర్తించారు.




# ఉధృతంగా గోదావరి

### మారుమూల గ్రామాల నుంచి బాధితుల తరలింపు

- ప్రమాదాన్ని అంచనా వేస్తున్న అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండి కళకళలాడుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతి అంచనా వేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏటూరునాగారం మండలంలో 75 మిల్లీమీటర్లు, మంగపేట 11.5 మిల్లీమీటర్లు, వాజేడు 26 మిల్లీమీటర్లు, వెంకటాపూర్‌ 14.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కన్నాయిగూడెం మండల వ్యాప్తంగా 43.8 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇలా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఛత్తీస్‌గఢ్‌, మహారాష్ట్ర నుంచి ఉప నదులు ఉప్పొంగి గోదావరిలో వరద అధిక మొత్తంలో చేరుతోంది. ఈ కారణంగా తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్‌ వద్ద గోదావరి శనివారం సాయంత్రం నాటికి 79. 2 0 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అధికారులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి బ్యారేజీకున్న 59 గేట్లు ఎత్తివేయడంతో నీరు బ్యారేజ్‌ నుంచి ఉరకలేస్తూ కింది ప్రాంతానికి ప్రవహిస్తుంది. దీంతో రామన్నగూడెం వద్ద గోదావరి ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్‌ వద్ద సాయంత్రం నాటికి 12.21 మీటర్ల చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తోంది. ఐటీడీఏ, జలవనరుల శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ఉన్నతాధికారులు, సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు.



రామన్నగూడెం పుష్కరఘాట్‌ వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి

### లోతట్టు ప్రాంతాల నుంచి బాధితుల తరలింపు

మండలంలోని కొండాయి, ఎలిశెట్టి గ్రామాల సమీపంలో జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా మరపడవలను ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం ఇద్దరు మహిళలు తీవ్ర అస్వస్థ గురికాగా వారిని ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందాలు ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఎలిశెట్టిపల్లి సమీపంలో కూడా జంపన్న వాగు అదే వేగంతో ప్రవహిస్తోంది. కాగా, గర్భిణులు దబ్బగట్ల శైలజ, పులిసె అనూష పురిటి నొప్పులతో బాధపడుతుండగా పడవల సాయంతో వారిని వాగు దాటించి ఆసుపత్రికి తరలించినట్లు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌, సందీప్‌, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి తెలిపారు.



కొండాయి వద్ద స్ట్రెచర్‌పై అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలిని తీసుకొస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం

వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశాలు ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

**రాకపోకలు నిషేధం..**

మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి వాగు దాటి వెళ్లొద్దని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాగులో నుంచి సాహసం చేయొద్దని తెలిపారు. ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని తెలిపారు. ఏదైనా అవసరం ఉంటే తమకు సమాచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కోరారు.

**కోతకు గురైన కరకట్ట..**

కరకట్ట పరిస్థితి దినదినగండంగా మారింది. ఒక చోట కోత గురైందని ఇసుక బస్తాలు వేస్తే మరో చోట కోతకు గురవుతూ వస్తోంది. కలెక్టర్‌ దివాకర పరిశీలించిన 7 కిలోమీటర్ల ప్రాంతం కంటే ఇప్పుడు 6 కిలోమీటర్ల వద్ద కోతకు గురవుతూ వస్తోంది. దీనిని గమనించి ఇరిగేషన్‌శాఖ అధికారులు కర్రలను పాతి ఇసు బస్తాలు, ట్యూబ్స్‌ ద్వారా గోదావరి నది కరకట్టకు తాకకుండా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో గండిపడితే రామన్నగూడెం గ్రామం ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదం ఉంది.



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి నుంచి పడవలో గర్భిణులను దాటిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది



ఎలిశెట్టిపల్లి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు



రామన్నగూడెం పుష్కరఘాట్‌కు 6కిలోమీటర్ల దూరంలో కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట

### వరదకోతకు గురవుతున్న వాగు ఒడ్డు



వాగుఒడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న జనావాసాలు

మంగపేట: మండలంలోని రాజుపేట ముసలమ్మవాగు వరద ఉధృతికి ఒడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఒడ్డు వెంట నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తిమ్మాపురం అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే వాగు రెండేళ్లుగా వర్షాకాలంలో భారీ వరదల కారణంగా బ్రిడ్జి సమీపంలో 15మీటర్ల వెడల్పుతో సుమారు 300 మీటర్లకు పైగా ఒడ్డు కోతకు గురైంది. అదే విధంగా బ్రిడ్జికి అవతలివైపు గల చెరుకుమిట్ట ప్రాంతంలో సుమారు 20 మీటర్లకు పైగా వెడల్పుతో 400 మీటర్ల వరకు ఒడ్డు కోతకు గురైంది. దీంతో బ్రిడ్జి సమీపంలోని బట్టు సతీశ్‌, దావీద్‌, భాస్కర్‌, ముగ్గల చెన్నయ్య నాలుగు కుటుంబాలకు చెందిన ఇళ్ల వరకు ఇప్పటికే ఒడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కుటుంబాలతో పాటు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ ప్రాంతాన్ని మాజీ సర్పంచ్‌ చందర్లపాటి శ్రీనివాస్‌, మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్‌ కొమరం అబ్బయ్య, కాంగ్రెస్‌ నాయకులు, గ్రామస్తులతో కలిసి శనివారం సందర్శించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

# మేడిగడ్డకు వరద పోటు..

- కాళేశ్వరం వద్ద 9.100 మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం
- అన్నారం వద్ద 17వేలు, మేడిగడ్డకు 3.73 లక్షల క్యూసెక్కుల వరద
- ప్రాణహిత ద్వారా ఉధృతంగా తరలివస్తున్న వరద

కాళేశ్వరం : తెలంగాణ, మహారాష్ట్రల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులకు వరద జోరు పెరిగింది. తెలంగాణలోని గోదావరి, మహారాష్ట్రలో ప్రాణహిత నదికి వరద తాకిడి పెరగడంతో శనివారం ఎగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం(సరస్వతి) బ్యారేజీ వద్ద మానేరు వాగు నుంచి వరద 17వేల క్యూసెక్కులు తరలివచ్చింది. బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు పూర్తిగా ఎత్తి నీటిని దిగువకు వదలగా కాళేశ్వరం చేరుతోంది. అటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గడ్చిరోలి జిల్లా మీదుగా ప్రాణహిత నది వరద ఉధృతి పెరుగుతోంది. ఆ వరద నీరు అంతా కలిసి కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద కలుస్తోంది. దీంతో కాళేశ్వరం పుష్కరఘాట్ల వద్ద 9.100 మీటర్లు ఎత్తులో నీటిప్రవాహం తరలిపోతుంది. కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలి మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి చేరుతుంది. బ్యారేజీవద్ద 3.73 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. బ్యారేజీలో మొత్తం 85గేట్లు పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు తరలిస్తున్నారు. రాత్రి వరకు మరింత పెరిగే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలివెళ్తున్న వరద



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి

**సమ్మక్క బ్యారేజీకి భారీగా వరదనీరు..**

కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ సమీపంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం భారీగా పెరుగుతోంది. శనివారం బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీ 59గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 79.20మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. అదే విధంగా వాజేడు మండలం పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 12.73 మీటర్లు ఉండగా శనివారం సాయంత్రానికి 13.14 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గంటకు పది సెంటీమీటర్ల చొప్పున గోదావరి నీటిమట్టం పెరుగుతుందని పేరూరు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు.



సమ్మక్క సాగర్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

### అధికారులు అప్రమత్తం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి.దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు లోలెవల్ వంతెనల మీదుగా వరద పారుతున్న నేపథ్యంలో అధికారుల బృందం శనివారం చంద్రుపల్లి వాగు, కాళేశ్వరం గోదావరి నదిని పరిశీలించి సిబ్బందికి రక్షణ చర్యలకు సూచనలిచ్చారు. గోదావరిలో స్నానాలకు అనుమతించొద్దని, వాగులపై నుంచి దాటకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై చక్రపాణి, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్‌

- రూ.12 లక్షల విలువైన 60 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌



నిందితుల అరెస్ట్‌ చూపుతున్న ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌, ఇతర పోలీస్‌ అధికారులు

తొర్రూరు: తొర్రూరు డివిజన్‌ కేంద్రంలో శనివారం ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈమేరకు తొర్రూరు పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ వివరాలు వెల్లడించారు. ఎస్సై జగదీశ్‌ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని గోపాలగిరి క్రాస్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనం అనుమానాస్పదంగా, వేగంగా వస్తుండగా నిలుపగా నలుగురు పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 33 ప్యాకెట్లలో 60 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఒడిశాకు చెందిన ముఠా ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు ప్రాంతం మీదుగా జహీరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఒడిశాకు చెందిన ప్రహ్లాద్‌ సిసా, అప్పన్న బైరాగి, మిథుల సిసా, బసోతి పంగిని అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశారు. ఎండు గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన బొలెరో వాహనాన్ని, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేశారు. ఈ కేసులో పలువురి కానిస్టేబుళ్లకు ఎస్పీ సుధీర్‌ రాంనాథ్‌ కేకన్‌ రివార్డులు అందించారు. సమావేశంలో సీఐ సంజీవ, ఎస్సైలు పిల్లల రాజు, గండ్రాతి సతీశ్‌, క్రాంతికిరణ్‌ పాల్గొన్నారు.

**కేయూ క్రాస్‌ వద్ద ముగ్గురు..**

- 1.2 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సంజీవ



మాట్లాడుతున్న సీఐ సంజీవ

హసన్‌పర్తి: ముగ్గురు గంజాయి వ్యాపారులు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి 1.2కిలోల గంజాయితో పాటు మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీ క్రాస్‌ వద్ద ఎస్సై రాజ్‌కుమార్‌ బృందం పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న క్రమంలో కేయూసీ కంపౌండ్‌ వాల్‌ సమీపంలో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే పోలీసులు అక్కడి చేరుకోగా గమనించిన ఇద్దరు యువకులు పరారయ్యారు. ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని నయీంనగర్‌ ప్రాంతానికి చెందిన మంద సాయిగణేశ్‌, ఇనుగాల సన్నీ, దుంపేటి రాకేశ్‌గా చెప్పారు. దీంతో ముగ్గురి అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ తెలిపారు.

**కాజీపేటలో ఇద్దరు క్రయవిక్రయదారులు..**

కాజీపేట రూరల్‌ : కాజీపేట రైల్వే ఏరియాలో శనివారం గంజాయి క్రయవిక్రయాలు జరుపుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. కాజీపేట సీఐ వై.సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎస్సై నవీన్‌కుమార్‌ సిబ్బందితో కలిసి కాజీపేట రైల్వే ఏరియాలో పెట్రోలింగ్‌ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండి పోలీసులను చూసి పారిపోవడానికి యత్నిస్తుండగా పట్టుకున్నారు. వీరిని కాజీపేటకు చెందిన పాలెపాక సందీప్‌, వరంగల్‌కు చెందిన పద్య శ్రీగోపాలశర్మగా గుర్తించారు. వారి వద్ద ఉన్న కవర్లను తనిఖీ చేయగా గంజాయి లభించింది. సందీప్‌కు కాజీపేట సోమిడికి చెందిన కుమ్మరి వరుణ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. 15 రోజుల క్రితం వరుణ్‌ వైజాగ్‌ నుంచి 2 కిలోల గంజాయి తీసుకొచ్చి సందీప్‌కు అమ్మమని ఇచ్చి వైజాగ్‌ వెళ్లాడు. సందీప్‌ అందులో నుంచి కొంత సరుకు అమ్మాడు. రెండు రోజుల క్రితం వరుణ్‌ ఫోన్‌ చేసి కాజీపేటకు శ్రీగోపాల్‌ శర్మ అనే వ్యక్తి వస్తాడు అతడికి కొంత గంజాయిని అమ్మమని సందీప్‌కు చెప్పాడు. 200 గ్రాముల గంజాయిని ప్యాక్‌ చేసుకోని రైల్వే కమ్యూనిటీహాల్‌ వద్ద గోపాల్‌శర్మకు ఇస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.35 వేల విలువైన 1.6 కిలోల గంజాయి, రూ.15వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, వరుణ్‌కుమార్‌ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

## ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో ఎనిమిదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం నిందితుడిపై పోక్సో నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెగడపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలో ఉన్న సుమన్‌ అనే యువకుడి ఇంటికి వెళ్లింది. తన తల్లికి ఫోన్‌ చేయడం కోసం మొబైల్‌ అడిగింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఆ యువకుడు బాలికలను ఇంట్లోకి తీసుకెళ్లి నగ్నం చేసి అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి అక్కడినుంచి ఇంటికి వెళ్లింది. తల్లికి జరిగిన ఘటనను వివరించింది. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. లైంగిక దాడికి యత్నించడం వాస్తవంగా తేలడంతో సుమన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ చెప్పారు.

## తల్లిదండ్రులు లేని జీవితం ఎందుకుని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- పెగడపల్లిలో ఘటన



హరీశ్‌(ఫైల్‌)

హసన్‌పర్తి: తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో వారు లేని జీవితం తనకు ఎందుకని మనస్తాపం చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన పిన్నింటి హరీశ్‌(30) తల్లిదండ్రులు కొంత కాలం క్రితం మృతి చెందాడు.అప్పటి నుంచి ఇంటిలో ఒక్కడే ఉంటూ మానసిక వేదనకు గురవుతున్నాడు. తల్లిదండ్రులు లేకుండా ఒంటరి జీవితం ఎలా గడపాలని భావించిన హరీశ్‌.. ఈనెల 18వ తేదీన పురుగుల మందుతాగాడు. ఎంజీఎం తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు.

## దుర్గమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, హుండీలో డబ్బు అపహరణ

కేసముద్రం: ఆలయ తాళం పగులగొట్టి అందులోని వెండికిరీటం, హుండీలోని డబ్బు అపహరించిన ఘటన మండలంలోని సబ్‌స్టేషన్‌ తండాజీపీలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్‌ కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్‌తండాజీపీలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయ తాళాన్ని శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. సుమారు రూ. 40 వేల విలువైన 417 గ్రాముల అమ్మవారి వెండికిరీటంతోపాటు, హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బు అపహరించారు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై వంశీధర్‌ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఏజెన్సీలో జ్వరంతో యువకుడి మృతి



దళ్‌సింగ్‌ (ఫైల్‌)

బయ్యారం: ఏజెన్సీలో జ్వరంతో బాధపడుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలం బంజరతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్‌ దళ్‌సింగ్‌(33)కు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఆరు నెలల కుమారుడు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొని మహిళ మృతి

- ప్రమాద సమయంలో కారులోనే రాజయ్య
- బాపూజీనగర్‌ వద్ద వాహనం వదిలి వెళ్లిన వైనం





మహిళ మృతదేహం.. బాపూజీనగర్‌లో వదిలివెళ్లిన కారు

మడికొండ: స్టేషన్‌ఘన్‌పూర్‌ మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ తాటికొండ రాజయ్య కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మడికొండ ఎస్సీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కలకొట్ల స్వప్న(40) పనినిమిత్తం నడుచుకుంటూ ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్‌ నుంచి హనుమకొండకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొట్టింది. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద సమయంలో రాజయ్య కారులోనే ఉన్నాడని, అయితే కారును డ్రైవర్‌ నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం అనంతరం కారును మాత్రం బాపూజీనగర్‌లో రోడ్డుపై వదిలిపెట్టిపోయారు. మృతురాలికి భర్త రాజు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.


# సాక్షి క్లాసిఫైడ్స్‌

**REAL ESTATE**

**ఇల్లు అమ్మబడును**

■ WGL, మండిబజార్‌, నిజాంపురలో 2 BHK ఇల్లు 130 Sq.Yds గలది అమ్మబడును. Govt. బ్యాంకులలో హోంలోన్‌ సౌకర్యం కలదు. వివరాలకు సంప్ర: 9573159670. [W-1239812]

**PLOT FOR SALE**

■ మామునూర్‌లో కుడా లేఅవుట్‌ రెండు దిశలా చౌరస్తా నుండి & జ్యోతిభాపులె ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్‌ రోడ్డుపై సౌత్‌ ఫేసింగ్‌ 263 అమ్మకానికై. 9032111600. [W-1242430]

■ KUDA, GWMC అప్రూవ్డ్‌ లేఅవుట్‌ ప్లాట్లు చింతగట్టు, హన్మకొండ & ఉనికిచర్ల రోడ్డు సోమిడి, రింగ్‌రోడ్డు లోపల అన్ని అభివృద్ధి పనులతో కేవలం చ॥గ॥ 15,000/- మాత్రమే. 9949732488. [W-1242429]

**SERVICES**

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా, ధరఖాస్తు హన్మకొండ. సెల్‌: 8096520976. [WA-6511]

**HOME CARE SERVICE**

■ స్టార్‌ హోంకేర్‌: వంట, ఇంటి పని చేయుటకు వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 12 గం॥, 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌ టేకర్స్‌ పంపించబడును. 8186926067, 8977263124. [W-1242426]

**FINANCE SERVICES**

■ సిరి అసోసియేట్స్‌: అన్ని రకాల రుణాలు, పర్సనల్‌, హౌసింగ్‌, మార్టిగేజ్‌, ఓపెన్‌ ప్లాట్స్‌పై కూడా సివిల్‌ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సెల్‌: 9666142226. [W-1239808]

**BUSINESS OFFER**

■ We are Ready to Invest Long Term Projects All Over the World. Ph : +91 8754809650. [IA-7028]

■ ICF కార్పొరేషన్‌ అగ్రికల్చర్‌, బిజినెస్‌, పర్సనల్‌, ఎడ్యుకేషన్‌, ప్రాపర్టీ పైన అమౌంట్‌ ఇవ్వబడును. ఏజెంట్స్‌ & DMA కావలెను. జీతం + కమీషన్‌. ఫోన్‌ 7988242391. [H-189696]

**REHABITATION CENTRE**

■ ఆత్మీయ రిహాబ్‌ సెంటర్‌ యందు వృద్ధులకు, పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం, క్యాన్సర్‌ పేషెంట్స్‌ కొరకు అవసరముగు 24 గం॥ల సేవలు అందించబడును. 62814 76205, 94403 25526 [M-12107]

**WANTED**

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌ టైం మాన్యువల్‌ రైటింగ్‌ వర్క్‌ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్‌ 3500/- మీ పేరు, అడ్రస్‌ కాల్‌/వాట్సప్‌ చేయగలరు. 95026 15217. [M-1185356]

■ ఒమేగా హోంకేర్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని, వంట పనికు వర్కర్స్‌ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20 K. ఫోన్‌ 8977639662, 8977639663 [H-796259]

**WANTED TEACHERS**

■ Wanted Teachers to teach English, EVS 1st - 5th & Hindi 4th - 8th Class. Theresa School, Nekkonda, Cell: 9397696508, 8801802586. [W-1239761]

■ A Female Tuition Teacher (E/M) Wanted for Tuition Center in Bheemaram, KU. Classes: 1st - 9th. Excellent in Maths & Science. Mon-Sat 5-30pm to 8-30pm. Call: 6281964203. [W-1239813]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్‌ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్‌ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్‌ భూపాలపల్లి : 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.